## కథ

# సినీ రైటర్

**వైజాగ్ నుంచి చంద్రశేఖర్ బావమ్మర్ది, శివానంద్ ఇంటికి భోజనానికి వస్తున్నానని ఫోన్ చేశాడు.**

**“ఎక్కడ్నుంచిరా? హైదరాబాద్ వచ్చావా?” అడిగింది సీతాదేవి తమ్ముడిని.**

**“లేదక్కా! ఇప్పుడు బయల్దేరుతున్నాను” అన్నాడు శివానంద్.**

**“అదేంట్రా! ఇప్పుడు పదకొండైంది. భోజనానికి ఎప్పుడొస్తావు?” ఆశ్చర్యంగా అడిగింది.**

''బస్సులోనో, రైల్లోనో అయితే ఎక్కడొస్తాను? ఫ్లైట్లో వస్తున్నాను. బావగారికి చెప్పు. ఇంట్లో వుండమను'' అన్నాడు శివానంద్.

''మీ బావ రిటైరైపోయాడుగా! ఎక్కడికెళ్తాడు? పనా? పాటా? ఇంట్లోనే గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నాడు'' అన్నది సీతాదేవి.

''అదేంటక్కా! బావ కథలు రాస్తాడుగా! బోలెడంత ఖాళీ. రాసుకోవచ్చుగా! గోళ్ళు గిల్లుకోవడం ఎందుకు?''

''ఆ... అప్పుడెప్పుడో పదేళ్ళక్రితం అడపాదడపా రాసేవాడు. ప్రమోషనొచ్చి ఆఫీసరయ్యాక ఆఫీసులో బిజీ అయిపోయి కథలు రాయడం మానేశాడు. ఇప్పుడంతా ఖాళీయే! కథలు రాసుకోవచ్చుగా! తృణమో, ఫణమో వస్తుందిగా అని ఎప్పుడో చెప్పాను. కథలు రాయడం అంటే అప్పడాలొత్తడం కాదు, వడియాలు పెట్టడం కాదు. దానికి ప్రాక్టీసుండాలి. పదేళ్ళు ప్రాక్టీసు లేకుండా పోయింది. కలం కదలదు అని మొండికేశాడు'' చెప్పింది సీతాదేవి.

శివానంద్ ''సర్లే'' అని నవ్వి వూరుకున్నాడు.

అన్నట్లే టంచన్‌గా లంచ్‌టైముకి వచ్చేశాడు శివానంద్.

''ఏంటోయ్! రైళ్ళు, బస్సులెక్కడం మానేశావట. విమానాల్లోనే తిరుగుతున్నావట. ఏంటి సంగతి? బ్లాక్‌మనీ బాగా పోగుపడిందా ఏం?'' అన్నాడు చంద్రశేఖర్.

''రియల్ ఎస్టేట్ బిజినెస్సుగా! బ్లాకు, వైటూ తప్పవు. వైజాగ్‌లో ఇప్పుడు బూమ్ నడుస్తున్నదిలే'' అన్నాడు శివానంద్.

''ఏంటి విశేషాలు? హఠాత్తుగా వచ్చావు?''

''వైజాగ్ ఏరియాలో సినిమా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మొదలుపెట్టాం. మా పార్టనర్స్ కొత్త సినిమా కమిట్ అవడానికెళ్దాం అంటే వచ్చా'' అన్నాడు శివానంద్.

''అదేంటి? సినిమా డిస్ట్రిబ్యూషన్ రిస్కు అని ఎవరో అన్నారే?''

''రిస్కులేని బిజినెస్ ఏవుంటుంది బావా? కిరాణాకొట్టు బిజినెస్ తప్ప అన్నింటిలోనూ, కొద్దో గొప్పో రిస్కు వుంటుంది. సినిమా బిజినెస్ లాటరీ లాంటిదే అనుకో. ఒక్కోసారి జాక్‌పాట్ తగులుతుంది మరి'' అని నవ్వాడు శివానంద్.

బావ, బావమరదులు కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేశారు. ఇంతలో ఇంటి ముందు కారు ఆగింది.

''బావా! మా పార్టనర్స్ వచ్చేశారు. మాతో పాటురా. రిలీజ్‌కాని సినిమా చూపిస్తా!'' అన్నాడు శివానంద్.

''వెళ్ళిరండి. ఖాళీగా గోళ్ళు గిల్లుకుంటూ ఇరవై నాలుగు గంటలూ ఇంట్లో ఏం కూర్చుంటారు?'' అన్నది సీతాదేవి.

చంద్రశేఖర్ భార్యవైపు గుర్రుగా చూశాడు.

''మాట మాటకీ ఖాళీగా వున్నావు, గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నావని ఎగతాళి చేస్తావేంటే? ఉద్యోగం లేకపోతే ఏం? ఇంట్లో కూర్చుని నెల నెలా పెన్షన్ తినడం లేదూ! సంవత్సరానికి రెండుసార్లు, డి.ఏ., పెరిగినప్పుడల్లా పెన్షన్ పెరుగుతుంది. అంతకంటే ఏం కావాలి?'' ఎగిరిపడ్డాడు చంద్రశేఖర్.

''ఆ.. వస్తుంది లెండి బోడి పెన్షన్. అదే మూల? బి.పి., షుగరూ లేకుండా రాయిలా వున్నారుగా! ఇంకేదైనా చేసి డబ్బు సంపాదించొచ్చుగా?''

''నాకు బి.పి. షుగరూ లేదని ఏడుస్తున్నావా? నీకు వుందిగా సుగరు! చాలదూ! స్వీట్సు తినడానికి లేదని, చప్పటి కాఫీ తాగాల్సొచ్చిందనీ ఏడుపు నీకు''

''సర్లే బావా! రాత్రికి తీరిగ్గా పోట్లాడుకుందురుగాని ముందు బయల్దేరు'' అన్నాడు శివానంద్.

చంద్రశేఖర్, శివానంద్ వెంట స్టూడియోకి వెళ్ళి ప్రివ్యూ థియేటర్లో సినిమా చూశారు.

ఆ సినిమా నిర్మాత, దర్శకులను చంద్రశేఖర్‌కి పరిచయం చేశాడు శివానంద్.

''మా బావ కథలు రాసేవాడు'' చెప్పాడు శివానంద్.

''ఏ పత్రికలో రాస్తున్నారు? ఈమధ్య ఏవైనా వచ్చాయా?'' డైరెక్టర్ మోహన వంశీకృష్ణ అడిగాడు.

''ఎప్పుడో రాశాలెండి. ప్రాక్టీసు పోయింది. ఇప్పుడేం రాయడం లేదు'' అని నవ్వాడు చంద్రశేఖర్.

''సినిమా కథలు రాయి బావా! దీనికి ప్రాక్టీసెందుకూ? వండడమేగా?'' అన్నాడు శివానంద్.

''అవునండీ. డెవలప్ చేసుకోవడమే కథని పట్టుకుని'' అన్నాడు డైరెక్టర్.

''ఇప్పుడు తెలుగు రైటర్లెవరూ సినిమా కథలు రాయడం లేదనుకుంటాగా? ఏ సినిమా చూసినా కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వం అని టైటిల్లో పడుతున్నది. డైరెక్టర్లే అన్నీ రాసేసుకుంటున్నారుగా!'' అన్నాడు చంద్రశేఖర్.

''ఔనండి. కథంటే మాకు మంచినీళ్ళు తాగినంత ఈజీ. ఏ కథైనా నిమిషాల్లో తయారు చేస్తాం. క్రైమ్, ఫ్యాక్షన్, లవ్‌స్టోరీ,

-వాణిశ్రీ

సెంటిమెంట్ ఏదైనా సరే!'' చెప్పాడు డైరెక్టర్.

చంద్రశేఖర్ డైరెక్టర్ని ఎగాదిగా చూశాడు. అతనికి నిండా ముప్పై ఏళ్ళున్నట్లు లేదు. ఇన్ని కథలు ఎలా తయారు చేస్తాడు? తను కథలు రాసే రోజుల్లో నెలకి ఒకటి, రెండు రాసేటప్పటికి తాతలు దిగొచ్చేవాళ్ళు. అంత జీవితానుభవం వుండి, బి.ఏ. లిటరేచర్ చదివి, పాత సాహిత్యం ఔపోసన పట్టి కథ రాయడానికి ఎంతో మథనపడేవాడు.

'ఇతనేంటి? నిమిషాల్లో ఏ టైపు కథ కావాలంటే ఆ కథ 'క్యూ.యస్.యస్' క్విక్ స్టోరీ సర్వీస్ టైపులో సప్లై చేస్తానంటున్నాడు. మైగాడ్. ఇతనేదో పెద్ద జీనియస్‌లాగున్నాడే' అనుకున్నాడు చంద్రశేఖర్.

''మీరేం చదివారు? ఎమ్.ఏ. లిటరేచర్ గాని, ఏదైనా డాక్టరేట్‌గాని చేశారా?''

డైరెక్టర్ పక పకా నవ్వాడు.

''ఇంటర్ తప్పానండి. ఇక మనకి చదువు అబ్బదని తెలుసుకుని సినిమా పిచ్చితో ఇంట్లో నుంచి పారిపోయి వచ్చా. డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో చేరిపోయా. నాలుగేళ్ళు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాక అసోసియేట్ అయ్యా. ఒక పెద్ద బేనర్లో చేస్తున్నప్పుడు డైరెక్టర్, ప్రొడ్యూసర్ కొట్టుకున్నారు. డైరెక్టర్ ఇక నేనీ సినిమా చెయ్యను గాక చెయ్యను అని వెళ్ళిపోయాడు. ప్రొడ్యూసర్ బతిమాలితే ఆ సినిమా పూర్తి చేశాను. నా అదృష్టం కొద్దీ అది బంపర్ హిట్టు.''

చంద్రశేఖర్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

''ఇక అంతే. ప్రొడ్యూసర్లు ఈగల్లా ముసిరారు'' అన్నాడు డైరెక్టర్.

''తెలుగులో వందలకొద్దీ స్టోరీ రైటర్లున్నారు. ఎన్నో నవలలు వస్తున్నాయి. మీ సినిమాల కోసం వాళ్ళ కథలు ఏవైనా తీసుకోవచ్చుగా'' అన్నాడు చంద్రశేఖర్.

డైరెక్టర్ చప్పరించేశాడు.

''అబ్బే! వాళ్ళెవరూ సినిమా కథ రాయలేరండీ. 'భావ కవుల వలె ఎవరికి తెలియని ఏవో పాటలు పాడాలోయ్' అని ఒక కవి పాట రాసినట్లు ఎవరికీ అర్థంకాని ఏవేవో కథలు రాస్తుంటారు. నా అసిస్టెంట్లు చదువుతుంటారు. ఏదైనా కొత్త పాయింట్ దొరుకుతుందేమోనని. అబ్బే! స్త్రీల కన్నీళ్ళు కష్టాలు, ముసలి వాళ్ళ బాధలు, గాథలు, ఎవరో అధికారి లంచాలు మేయడం, రాజకీయ నాయకుడి కొడుకు ఎవరో అనాథ ఆడపిల్లను రేప్ చెయ్యడం. ఇవెందుకు మాకు పనికొస్తాయి. ఇంకా గోదారి కథలు, సీమ కథలు సింగినాథం కథలు '' అన్నాడు.

''ఒకప్పుడు తెలుగు నవలలు సినిమాలు తీశారుగా?''

''అదంతా ఒకప్పుడు. ఇప్పుడు పాత చింతకాయ పచ్చడి అటువంటి కథలు సినిమా తీస్తే నెత్తిన గుడ్డేసుకోవాల్సిందే ప్రొడ్యూసర్''

''ఇప్పుడూ ప్రొడ్యూసర్లలో చాలామంది అదేపని చేస్తున్నారుగా''

''వాళ్ళంతా ఏక్ ఫిల్మ్‌కా సుల్తాన్స్. ఫీల్డులో సెటిలైపోయిన వాళ్ళు బాగానే వుంటారు. ఒకటీ అరా ఫ్లాపులొచ్చినా కోలుకుంటారు. ఎక్కువమంది ప్రొడ్యూసర్లకి సినిమా ఫీల్డ్ గురించి ఎ.బి.సి.డీలు తెలియవు. చింతపండు అమ్మి, రియల్ ఎస్టేట్‌లో సంపాదించో, రొయ్యల చెరువుల్లో దశ తిరిగిన వాళ్ళో సినిమా గ్లామర్‌కి దీపం పురుగుల్లా వస్తారు. మాడిపోతారు''

''నాకు చాలా ఆశ్చర్యంగా వుందండీ. చిన్న వయసులో ఇన్నన్ని సినిమా కథలు రాయడం'' అన్నాడు చంద్రశేఖర్.

డైరెక్టర్ నవ్వి ''నాకు అసిస్ట్ చెయ్యడానికి రైటర్లు వున్నార్లెండి'' అన్నాడు.


''మంచి పనండి. కొందరు రైటర్లని కూర్చోబెట్టుకుని కథలు తయారు చేయిస్తుంటారన్నమాట. పోనియ్యండి ఖాళీగా వున్న మాబోటి కొందరు రైటర్లకైనా కాస్త ఆదాయం దొరుకుతుంది. నాకు తెలిసిన రైటర్లెవరైనా మీ దగ్గర పనిచేస్తున్నారా? ఏం లేదు. కుతూహలం కొద్దీ అడిగాను. వాళ్ళను ఘోస్ట్ రైటర్లంటారట కదా?'' అన్నాడు చంద్రశేఖర్.

''అబ్బే నా దగ్గర అటువంటి వాళ్ళెవరూ లేరండి. మీకంత ఇంట్రెస్ట్ వుంటే మా ఆఫీసుకి











రండి వాళ్ళను చూపిస్తాను'' అన్నాడు డైరెక్టర్.

సరే వాళ్ళెంత పెద్ద కథారచయితలో చూద్దామని డైరెక్టర్ వెంట అతని ఆఫీసుకి వెళ్ళాడు చంద్రశేఖర్.



## పాపం కరీనా!

ఏ ముహూర్తాన కొత్త 'డాన్'లో 'ఏ మేరా దిల్ ప్యార్ కా దీవానా' అంటూ ఐటమ్ సాంగ్ చేసిందో గానీ కరీనాకపూర్‌కి ఇప్పుడు చాలావరకు అన్ని ఆఫర్లూ ఐటమ్ నంబర్లే వస్తున్నాయిట. మొహమాటానికో, సరదాకో కొన్ని ఒప్పుకుంటుంటే అలాంటివే మళ్లీ మళ్లీ వస్తుంటే కరీనా విస్తుబోతోందిట. ఇలా అయితే హీరోయిన్‌గా ఆమెని జనాలు మరిచిపోయే ప్రమాదం లేదూ? అని ముక్కున వేలేసుకుంటున్నారు బాలీవుడ్ జనాలు. కరీనా మాత్రం ఆ సంగతి గ్రహించలేదా ఏంటి?

డైరెక్టర్ అతన్ని ఒక ఏ.సి. రూమ్‌లోకి తీసుకెళ్ళాడు. అక్కడ కొన్ని కంప్యూటర్లు వున్నాయి. వాటి ముందు టైపు చేస్తూ ఆపరేటర్లు కూర్చుని వున్నారు.

''వీళ్ళేసార్ నా రైటర్లు'' అన్నాడు డైరెక్టర్.

చంద్రశేఖర్ వాళ్ళని ఎగాదిగా చూశాడు. ఎవరికీ ముప్పై ఏళ్ళు పైన లేవు. అంతా యువకులే.

''వీళ్ళంతా రైటర్లేనా?'' ఆశ్చర్యంగా అడిగాడు చంద్రశేఖర్.

''ఔను సార్! రైటర్లు కాని రైటర్లనుకోండి. వీళ్ళెట్లా పని చేస్తారో చూడండి. సపోజ్ హీరో రోడ్డుమీద వెళ్తున్నాడు. ఏదో అన్యాయం జరుగుతుంటే స్పందించి ఎదిరించాలి. అంతేకదా! ఈ కంప్యూటర్లో సొసైటీలో జరుగుతున్న అన్యాయాలన్నీ డైలీ పేపర్లలో వచ్చేవి ఫీడ్ చేయబడి వుంటాయి. కంప్యూటర్లో అవన్నీ అప్ టూ డేట్‌గా వుంటాయి. ఈరోజు వచ్చినవి కూడా. పోలీసులమని చెప్పి ఒక ముసలమ్మను అటకాయించి బంగారు నగలు దోచుకున్న దొంగలు, స్కూటర్‌లో పెట్టిన డబ్బు మాయం. బస్టాప్‌లో నిలబడిన యువతిని కిడ్నాప్ చేసిన దుండగులు. ఇటువంటివన్నీ ఉంటాయి. అందులో మాకు నచ్చింది సెలక్ట్ చేసుకుంటాం. అలాగే అన్నీను''

చంద్రశేఖర్ ఆశ్చర్యంగా చూస్తుంటే ఒక్కొక్క కంప్యూటర్లో ఏవేమి ఫీడ్ చేసినవి వున్నాయో చూపించాడు డైరెక్టర్. ఒకదాంట్లో సెంటిమెంట్ దృశ్యాలు పాతవి. మరొకదాంట్లో సూపర్‌ఫైట్లు, సూపర్‌హిట్ లవ్‌స్టోరీస్, హాలీవుడ్, బాలీవుడ్, టామిల్, మళయాళం ఒకటేమిటి అన్నీ కంప్యూటర్లలో వున్నాయి. ఏవి కావాలంటే అది రెడీ. రూమ్ నిండా పాత సినిమాల సిడీలు, డివీడీలు పేర్చి వున్నాయి.

చంద్రశేఖర్‌కి మతిపోయింది.

'తెలుగు సినిమా కథలకు హేట్సాఫ్'

ఏ.సి. రూమ్‌లో నుంచి వచ్చిన చంద్రశేఖర్‌కి శివానంద్ కనిపించి ''ఏం బావా! ఈ డైరెక్టర్ దగ్గర పని చేస్తావా?'' అన్నాడు.

''అబ్బే మనం పనికిరామోయ్! కంప్యూటర్ ఆపరేషన్ వచ్చి వుండాలి'' అన్నాడు చంద్రశేఖర్ తలరుద్దుకుంటూ.

☆